
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
సంగారెడ్డి మెదక్ జిల్లాల వార్తలు
5
గురువారం 20 నవంబరు 2025




రాలిపోతున్న గింజలను చూపిస్తున్న రైతు

జగ్గారెడ్డి ఆధ్వర్యంలో... సంగారెడ్డిలో ఘనంగా ఇందిరాగాంధీ జయంతి

ఉమ్మడి మెదక్ జిల్లాతో ఇందిరమ్మకు ప్రత్యేక అనుబంధం

- ఇక్కడి నుంచే ఎంపీగా గెలిచి ప్రధాని అయ్యారు
- ఆనాడు కాంగ్రెస్ అగ్రనేతలు రాంచంద్రారెడ్డి, బాగారెడ్డి కోరిక మేరకు ఇక్కడ పోటీచేసి గెలిచారు
- సంగారెడ్డి ఓడీఎఫ్ ఫ్యాక్టరీ, బీడీఎల్, ఇక్రిశాట్ తెచ్చిన ఘనత ఇందిరాగాంధీదే
- జయంతి వేడుకల్లో ప్రసంగించిన జగ్గారెడ్డి


ఇందిరాగాంధీ జయంతి వేడుకల్లో మాట్లాడుతున్న జగ్గారెడ్డి

సంగారెడ్డి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : భారత మాజీ ప్రధాని, స్వర్గీయ ఇందిరాగాంధీ 108వ జయంతిని జగ్గారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం సంగారెడ్డిలో ఘనంగా నిర్వహించారు. ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పెద్దఎత్తున తరలివచ్చిన కాంగ్రెస్ శ్రేణులను ఉద్దేశించి జగ్గారెడ్డి ప్రసంగించారు. ఉమ్మడి మెదక్ జిల్లాతో ఇందిరా గాంధీకి ప్రత్యేక అనుబంధం ఉందన్నారు. మెదక్ పార్లమెంటు నుంచి ఎంపీగా గెలిచి ప్రధాని అయ్యారని, ఆమె చొరవతోనే సంగారెడ్డి జిల్లాలో ఓడీఎఫ్, బీడీఎల్, ఇక్రిశాట్ సాకారమయ్యాయని వివరించారు. తోపాజి అనంతకిషన్, చేర్యాల ఆంజనేయులు, రాంరెడ్డి, కూన సంతోష్, సత్యనారాయణ, జార్జ్ తదితరులు పాల్గొన్నారు.



కూలీల కొరత.. కోత మిషన్ల కటకట

రేగోడు, నవంబర్ 19 (ఆంధ్రజ్యోతి) : రేగోడు మండలంలో వరి సాగు చేసిన రైతులకు ఇప్పుడు కోతల దశలో కష్టాలు చుట్టుముట్టాయి. మర్పల్లి, రేగోడు, చౌదరిపల్లి, కొత్వాల్‌పల్లి, తిమ్మాపూర్, వెంకటాపూర్, కొండాపూర్, జగిర్యాల వంటి గ్రామాల్లో ఆలస్యంగా వేసిన వరి పంట ప్రస్తుతం కోతకు సిద్ధంగా ఉంది. అయితే, ఈ సమయంలో కూలీల కొరత విపరీతంగా ఉండడం, కోత మిషన్లు దొరకకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. పండిన పంటను కోయడానికి కూలీలు రావడం లేదని, ఉన్న కొద్దిపాటి మిషన్లు కూడా అందుబాటులో లేకపోవడంతో చేతికొచ్చిన వరి గింజలు పొలంలోనే రాలిపోయి నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పంట సాగు మొదలు ధాన్యం అమ్మకం వరకు ప్రతి దశలోనూ ఇబ్బందులు తప్పడం లేదని వారు వాపోయారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు, వ్యవసాయానికి కూలీల కొరతను తీర్చేందుకు గాను, ఉపాధి హామీ పథకం కూలీలను వ్యవసాయ పనులకు అనుసంధానం చేయాలని మర్పల్లి గ్రామానికి చెందిన రైతు శివశంకర్ అధికారులను కోరారు.

పత్తి కొనుగోళ్లు పారదర్శకంగా చేపట్టాలి

- సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య


సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య

సంగారెడ్డి రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లాలో పత్తి కొనుగోళ్లను పారదర్శకంగా నిర్వహించాలని సంగారెడ్డి కలెక్టర్ డాక్టర్ ఎ.ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. బుధవారం సంగారెడ్డి కలెక్టరేట్‌లో అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆరు మార్కెటింగ్ యార్డుల పరిధిలోని 24 జిన్నింగ్ మిల్లుల నుంచి సీసీఐ ద్వారా ప్రభుత్వ మద్దతు ధరకు పత్తి కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. పత్తి అమ్మకానికి ఆధార్ ప్రామాణికత తప్పనిసరని, ఆధార్‌తో అనుసంధానం చేసిన బ్యాంకు ఖాతాల్లోనే జమ చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. జిల్లాలోని అన్ని జిన్నింగ్ మిల్లులను తనిఖీ చేసి, యంత్రాలు, వసతులు, భద్రతా ప్రమాణాలు సరిగ్గా ఉన్నాయో లేదో పర్యవేక్షించాలని ఆదేశించారు. వీటితోపాటు ఆర్ఆర్ఆర్ రోడ్డు ఓవర్ బ్రిడ్జిలు, నేషనల్ ఇన్వెస్టిమెంట్ మ్యానుఫ్యాక్చరింగ్ జోన్ (నిమ్జ్) వంటి కీలక ప్రాజెక్టుల భూసేకరణపై అధికారులు దృష్టి సారించాలని సూచించారు.

అర్హులందరికీ ఇందిరమ్మ చీరలు అందేలా చూడాలి

ఇందిరమ్మ చీరల పంపిణీపై సమీక్షిస్తూ... అర్హులైన ప్రతి మహిళకు చీరలు అందేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ప్రావీణ్య ఆదేశించారు. జిల్లాలో సెర్ప్, మెప్మా పరిధిలో మొత్తం 24,904 మహిళా సంఘాలు ఉండగా, వాటిలో 2,60,692 మంది సభ్యులు ఉన్నారని అధికారులు కలెక్టర్‌కు వివరించారు సభ్యులందరికీ చీరలు అందేలా చూడాలని, ఇంకా గ్రూపుల్లో చేరని మహిళలను గుర్తించి, సంఘాలలో చేర్చే ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ సూచించారు.

పొగమంచు

ఉష్ణోగ్రతలు రోజురోజుకూ గణనీయంగా పడిపోతుండడంతో ఉదయం వేళల్లో దట్టమైన పొగమంచు రహదారులను కమ్మేస్తోంది. దారి కానరాని పరిస్థితులు ఏర్పడుతున్నాయి. వాహనాల నుంచి వెలువడే పొగతో ఈ మంచు మరింత దట్టంగా మారి, రోడ్లపై ఎదురుగా వచ్చే వాహనాలు దగ్గరి వరకు చేరాకగాని తెలియడం లేదు. దీంతో రోడ్డు ప్రమాదాల ముప్పు గణనీయంగా పెరిగింది. ప్రయాణికులు, వాహనదారులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరిస్తున్నారు.

- సంగారెడ్డి క్రైం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి)





- రహదారులను కమ్మేస్తున్న మంచుతెరలు
- ఉదయం వేళల్లో ప్రమాదకరంగా ప్రయాణం
- అప్రమత్తతే ప్రాణాలకు రక్షణ

సంగారెడ్డి జిల్లా గుండా వెళ్తున్న 65వ నంబరు జాతీయ రహదారి (హైదరాబాద్-ముంబయి ప్రధాన మార్గం), అలాగే 101 అకోలా-నాందేడ్ రహదారిపై వాహనాల రద్దీ అధికంగా ఉంటుంది. ముఖ్యంగా హైదరాబాద్ నుంచి షిర్డీ, ముంబయి, మహారాష్ట్రలకు వెళ్లే ప్రైవేట్ ట్రావెల్స్ భారీ వాహనాలు ఈ మార్గంలో వేల సంఖ్యలో తిరుగుతుంటాయి. ప్రస్తుతం 65వ నంబరు రహదారిపై ఆరు లేన్ల విస్తరణ పనులు జరుగుతున్నాయి. ఒక వైపు నిర్మాణ పనులు, మరోవైపు ఉదయం పూట దట్టమైన పొగ మంచు కలవడం వల్ల ఈ మార్గంలో ప్రయాణం నరకప్రాయంగా మారింది. భారీ వాహనాల రాకపోకలతో రేగుతున్న దుమ్ము సైతం ద్విచక్ర వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు సృష్టిస్తోంది. ఈ పరిస్థితుల్లో

మిగతా 8వ పేజీలో

చలి పంజా

- వారం నుంచి కనిష్ఠ ఉష్ణోగ్రతలు
- బుధవారం న్యాల్‌కల్‌లో అత్యల్పంగా 9.5 డిగ్రీలు నమోదు

కోహీర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : వారం రోజులుగా చలి తీవ్రత తగ్గడం లేదు. ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోయాయి. ప్రతీ రోజు ఉదయం, సాయంత్రం, రాత్రి వేళల్లో అత్యల్ప ఉష్ణోగ్రతలు 10 డిగ్రీల కంటే తక్కువగానే నమోదవుతున్నాయి. దీంతో ఉమ్మడి మెదక్ జిల్లా వణుకుతూనే ఉంది. బుధవారం ఉమ్మడి జిల్లాలో ఐదు ప్రాంతాల్లో సింగిల్ డిజిట్‌కు పరిమితమైంది. సంగారెడ్డి జిల్లాలోని న్యాల్‌కల్‌లో 9.5 కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. న్యాల్‌కల్ 9.5, కోహీర్ 9.6, పోతిరెడ్డిపేట్ 9.6, ఝరాసంఘం 9.9, కంగ్టి 9.9 డిగ్రీల ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. ఉమ్మడి జిల్లాలో మరో 16 ప్రాంతాల్లో 11 డిగ్రీల లోపు కనిష్ఠ ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. గురువారం సాయంత్రం నుంచి చలి తీవ్రత తగ్గుతుందని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు.


గజ్వేల్‌లో అసంపూర్తిగా కమ్యూనిటీహాల్

నిలిచిన పనులు.. నిధులు వృథా

- ప్రజాధనమంటే లెక్కలేదా?
- గజ్వేల్‌లో అసంపూర్తిగా నిర్మాణాలు
- నిలిచిన పనులతో నిరుపయోగంగా ప్రజా భవనాలు
- రూ.కోట్లు వెచ్చించినా దక్కని ఫలితం
- ఇబ్బందుల్లో ప్రజలు..
- త్వరితగతిన పూర్తిచేయాలి విజ్ఞప్తి

7

వేర్వేరు ప్రమాదాల్లో నలుగురి మృతి

- అంతారం జాతరలో గుండం నీటిలో మునిగి వ్యక్తి మృతి
- ట్రాక్టర్, ఆటో ఢీ.. విద్యార్థి దుర్మరణం
- ఆర్టీసీ బస్సు ఢీకొని సెక్యూరిటీ అధికారి
- బైక్ అదుపుతప్పి యువకుడు..

7

హత్య కేసులో నలుగురు నిందితుల అరెస్టు

7

ఉమ్మడి జిల్లా అభివృద్ధే లక్ష్యం

- సంక్షేమ పథకాలపై నిరంతర పర్యవేక్షణ అవసరం
- మెదక్‌లో త్వరలో క్యాన్సర్ ఆసుపత్రి.. అంబులెన్స్ ఏర్పాటు
- జిల్లా వ్యాప్తంగా క్యాన్సర్ వైద్య సేవలు
- మెదక్ ఎంపీ రఘునందన్‌రావు


మాట్లాడుతున్న ఎంపీ రఘునందన్‌రావు, పక్కన కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ అర్బన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి మెదక్ జిల్లా అభివృద్ధే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నట్లు మెదక్ ఎంపీ రఘునందన్‌రావు పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా అభివృద్ధి సమన్వయ, మానిటరింగ్ కమిటీ(దిశ) సమీక్ష సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జిల్లాలో అమలు చేస్తున్న వ్యవసాయ, విద్య, అర్అండ్‌బీ, పీఎంఏవై, జాతీయ గ్రామీణ జీవనోపాధి, రహదారిఅభివృద్ధి, ఇతర సంక్షేమ పథకాలపై నిరంతర పర్యవేక్షణతోపాటు ప్రజలకు లబ్ధిచేకూరే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశ వివరాలకు సంబంధించిన ప్రొసీడింగ్ అధికారిక వెబ్‌సైట్‌లో పొందుపరిచాలన్నారు. అధికారులందరూ సమన్వయంతో పని చేసి మెదక్ జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించాలన్నారు. ప్రజల్లో క్యాన్సర్ పట్ల అవగాహన పెంపొందించడానికి భారత సర్కార్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందన్నారు. మెదక్‌లో నూతన క్యాన్సర్ ఆసుపత్రి నిర్మాణం చేపట్టేందుకు కలెక్టర్ ప్రత్యేక చొరవతో 1000 గజాల స్థలం ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులు, కొత్త పథకాలు, ప్రతీ ఇంటికి చేరవేసేలా చూడాలన్నారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న నేషనల్ హైవేతో పాటు నర్సాపూర్ ప్రాంతంలో కొత్తగా ఏర్పాటు చేస్తున్నన్న జాతీయ రహదారి 765 డీజీ గుమ్మడిదల, నర్సాపూర్ ఎలివెంటల్ క్యారిడార్ డీపీఆర్ కోసం చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రైవేటు సంస్థల యాజమాన్యాన్ని ఒప్పించి తొలిసారిగా దేశంలోని ఏ జిల్లాలోని ఏర్పాటు చేయని విధంగా మెదక్‌లో వెయ్యి గజాల్లో క్యాన్సర్ ఆసుపత్రిని నిర్మించి చికిత్స అందిస్తామన్నారు. దేశంలో 736 జిల్లాలు ఉండగా.. క్యాన్సర్ టెస్టింగ్ మెదక్‌లో ప్రారంభం కానుండడం శుభ పరిణామంగా పేర్కొన్నారు. క్యాన్సర్ ప్రిలిమినరీ పరీక్షల కోసం బస్సు తయారు చేస్తున్నట్లు. ఇందు కోసం ఓ సంస్థ రూ.69.59 లక్షలతో కొనుగోలు చేసి ఇవ్వడానికి ముందుకు వచ్చిందన్నారు. ఈ బస్సు ద్వారా జిల్లా వ్యాప్తంగా ప్రతీ వారం మండల కేంద్రంలోని హైస్కూల్ ఆవరణలో క్యాన్సర్ స్ర్కీనింగ్ క్యాంపులు ఏర్పాటు చేసి, చికిత్స అందించే విధంగా ముందుకు వెళ్తున్నామన్నారు. ఆ సంస్థకు ఎంపీ కృతజ్ఞతలు తెలిపారు. దిశ మీటింగ్‌లో చర్చించిన అంశాలను, సమస్యలను అధికారులు పరిష్కరించాలని ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో డీఆర్వో భుజంగరావు, డీఆర్డీవో పీడీ శ్రీనివాసరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

చందంపేట పీఏసీఎస్ చైర్మన్‌పై అవిశ్వాసం

- కలెక్టర్, డీసీవోకు నోటీస్ అందజేసిన ఏడుగురు డైరెక్టర్లు

చిన్నశంకరంపేట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : చిన్నశంకరంపేట మండల పరిధిలోని చందంపేట ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్) చైర్మన్ చింతల సత్యనారాయణపై ఏడుగురు డైరెక్టర్లు బుధవారం అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. చైర్మన్‌పై అవిశ్వాసం కోరుతూ డైరెక్టర్లు జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, డీసీవో (జిల్లా సహకార అధికారి) కరుణాకర్‌ని కలిసి నోటీసు అందజేశారు. చందంపేట సహకార సంఘంలో మొత్తం 12 మంది డైరెక్టర్లు ఉండగా, ప్రస్తుతం వైస్ చైర్మన్ మరణించడం, ఒకరిని తొలగించడంతో డైరెక్టర్ల సంఖ్య పదికి చేరింది. ఇందులో ఏడుగురు మెజార్టీ డైరెక్టర్లు చైర్మన్‌పై అవిశ్వాసం తీర్మానం పెట్టారు. చైర్మన్ సత్యనారాయణ డైరెక్టర్లకు ఎలాంటి విషయం చెప్పకుండా ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని, సహకార సంఘానికి సంబంధించిన నిధులు, లెక్కలు చెప్పడంలేదని, కనీసం సమావేశం కూడా ఏరాటు చేయడంలేదని వారు ప్రధానంగా ఆరోపించారు. అంతేకాకుండా, సంఘం సీఈఓ (ముఖ్య కార్యనిర్వహణ అధికారి)కు కొన్ని నెలల నుంచి వేతనం ఇవ్వకుండా ఫైళ్లపై సంతకం చేయడంలేదని తెలిపారు. సహకార సంఘంలో అవకతవకలకు పాల్పడుతున్నందునే అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టినట్లు డైరెక్టర్లు స్పష్టం చేశారు. అవిశ్వాస నోటీసుపై డైరెక్టర్లు మల్లారెడ్డి, బాలయ్య, నర్సింహారెడ్డి, రామ్‌రెడ్డి, పాండు, శేఖమ్మతో పాటు మరో డైరెక్టర్ సంతకం చేశారు.


డీసీవో కరుణాకర్‌కు అవిశ్వాస నోటీస్ పత్రాన్ని అందజేస్తున్న డైరెక్టర్లు

ఉత్సాహంగా సైన్స్ ఫెయిర్

- ఖేడ్‌లో రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు కృషి చేస్తా
- ఎమ్మెల్యే సంజీవరెడ్డి


నమూనాను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి



సైన్స్ ఫెయిర్‌లో ప్రదర్శలను తిలకించడానికి వచ్చిన విద్యార్థులు

నారాయణఖేడ్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : నారాయణఖేడ్ పట్టణ శివారులోని ఈ తక్షిలా పాఠశాల ఆవరణలో బుధవారం నిర్వహించిన జిల్లాస్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శన, ఇన్‌స్పైర్ అవార్డుల కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. జిల్లా నలుమూలల నుంచి మొత్తం 208 యూపీఎస్, 311 ఉన్నత పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో 108 ఇన్‌స్పైర్ ప్రదర్శనలు, ఉపాధ్యాయులు రూపొందించిన నాలుగు ప్రదర్శనలు ఉన్నాయి. విద్యార్థులు రూపొందించిన ఎగ్జిబిట్లు ఆలోచన రేకెత్తించాయి. ప్రధానంగా వ్యవసాయం, ప్లాస్టిక్ రహిత వినియోగం, గ్రీన్ ఎనర్జీ, సాంకేతిక విజ్ఞానం, గణితం, ఆరోగ్యం, నీటి పొదుపు నిర్వహణ వంటి అంశాలపై విద్యార్థులు చక్కగా వివరించారు. ముఖ్యంగా పొలాల్లో కలుపులు తీసేందుకు వినియోగించే యంత్రాలు, రసాయనాలు లేకుండా సంప్రదాయ విత్తనాలను తయారు చేసుకునే విధానం, వృద్ధుల అవసరాలు తీర్చే యంత్రాలు, ప్రమాదం జరిగినప్పుడు హెల్మెట్ ద్వారా హెచ్చరికలు జారీ చేసే విధానం, మద్యం సేవించి వాహనాలు నడిపేవారిని పసిగట్టే యంత్రాలు, వాటర్ ట్యాంక్ నిండిన వెంటనే ఆటోమేటిక్‌గా స్టార్టర్ ఆగిపోయే విధానంపై చేసిన ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. స్థానిక ఎమ్మెల్యే సంజీవరెడ్డి ఈ ఎగ్జిబిట్లను పరిశీలించి, విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఖేడ్‌లో జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్‌ను చక్కగా నిర్వహించారని, ఈ ప్రాంత విద్యార్థులు రాష్ట్ర, జాతీయస్థాయికి కూడా ఎదుగుతారని ఆకాంక్షించారు. రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెయిర్‌ను కూడా ఖేడ్‌లో నిర్వహించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ ప్రదర్శనను జహీరాబాద్ ఎంపీ సురేష్‌షెట్కార్ కూతురు శివానీ షెట్కార్, మున్సిపల్ తాజామాజీ వైస్ చైర్మన్ దారం శంకర్, పీఏసీఎస్ చైర్మన్ శోభ అశోక్‌రెడ్డి తదితరులు పరిశీలించారు. జిల్లా సైన్స్ అధికారి సిద్దారెడ్డి, పాఠశాల కరస్పాండెంట్ శరత్, మండల విద్యాధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అక్రమంగా మట్టిని తరలిస్తున్న ఐదుగురిపై కేసు

పటాన్‌చెరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఇతరుల పొలంలో అక్రమంగా మట్టి తవ్వుతున్న ఐదుగురు వ్యక్తులపై కేసు నమోదైన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ సుభాష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తెల్లాపూర్ పురపాలక పరిధి ముత్తంగి గ్రామం సర్వేనంబర్లు 224, 225లలో చిన్న హనుమంతరెడ్డి పేరుపై ఐదు ఎకరాల భూమి ఉంది. యజమాని మృతి చెందగా, ఆయన కుమారుడు పుల్లయ్యగారి వెంకటనర్సింహారెడ్డి కుటుంబసభ్యులతో హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు. ఇదే అదునుగా గ్రామానికి చెందిన దేవ్‌రెడ్డి, ప్రకాష్‌నాయక్, రవీందర్, నితిన్, ప్రశాంత్ పొలంలో మట్టి తవ్వి అక్రమంగా టిప్పర్‌లతో రాత్రి సమయాల్లో తరలిస్తున్నారు. దీనిపై సమాచారం అందుకున్న వెంకటనర్సింహారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

నిలిచిన పనులు.. నిధులు వృథా

ప్రజాధనమంటే లెక్కలేదా?


నిరుపయోగంగా గజ్వేల్ ఆధునిక బస్టాండ్

● గజ్వేల్‌లో అసంపూర్తిగా నిర్మాణాలు
● నిలిచిన పనులతో నిరుపయోగంగా ప్రజా భవనాలు
● రూ.కోట్లు వెచ్చించినా దక్కని ఫలితం
● ఇబ్బందుల్లో ప్రజలు.. త్వరిగతిన పూర్తిచేయాలి విజ్ఞప్తి

గజ్వేల్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలో కోట్ల రూపాయల ప్రజాధనంతో నిర్మించిన పలు ప్రభుత్వ భవనాలు, రోడ్లు అసంపూర్తిగా నిలిచిపోవడం, ప్రజా వినియోగంలోకి రాకపోవడం ఆందోళన కలిగిస్తోంది. గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన ఈ నిర్మాణాలను ఇప్పుడు పట్టించుకునే వారే కరువయ్యారని, దీంతో ప్రజలు, రైతులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు వాపోతున్నారు. ప్రభుత్వం మారిన తర్వాత ఈ సమస్య మరింత జఠిలమైందని చెబుతున్నారు. అసంపూర్తి పనులు పూర్తి చేస్తే పాత ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందనే ఉద్దేశంతో ప్రస్తుత ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

నిలిచిపోయిన రింగ్‌రోడ్డు

రూ.280 కోట్ల అంచనా వ్యయంతో 22 కిలోమీటర్ల మేర నిర్మిస్తున్న గజ్వేల్-ప్రజ్ఞాపూర్ రింగ్‌రోడ్డు పనులు మధ్యలోనే ఆగిపోయాయి. దీని కారణంగా కంటైనర్లు, భారీ లారీలు పట్టణంలోని ప్రధాన రహదారి గుండా వెళ్లాల్సి వస్తోంది. ఫలితంగా ట్రాఫిక్ సమస్యతో పాటు ప్రమాదాలు జరుగుతున్నాయి. రింగ్‌రోడ్డులోని జాలిగామ వద్ద రైల్వే క్రాసింగ్ పనులు జరుగుతున్నప్పటికీ, పాత ఆర్డీవో కార్యాలయం వద్ద సుమారు 150 మీటర్ల రోడ్డు పనులు పూర్తి కాకపోవడంతో చిట్యాల, భువనగిరి, ప్రజ్ఞాపూర్, గజ్వేల్, తూప్రాన్, నర్సాపూర్, సంగారెడ్డి లింక్ రోడ్డు మార్గంలో వెళ్లే వాహనాలు తప్పనిసరిగా మునిసిపాలిటీ ప్రధాన రోడ్డు గుండా వెళ్లాల్సి వస్తున్నది. ఈ రింగ్‌రోడ్డు పూర్తయితే వాహనదారులు, ప్రజలకు ట్రాఫిక్ కష్టాలు తీరతాయని భావిస్తున్నారు. టెలికాం బోర్డు సభ్యుడు కమ్మరి శ్రీనివాస్ ఈ రింగ్‌రోడ్డును త్వరితగతిన పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

అలంకారప్రాయంగా ఆడిటోరియం..

రూ.30 కోట్ల వ్యయంతో అత్యాధునికంగా నిర్మించిన మహతి ఆడిటోరియం అలంకారప్రాయంగా మిగిలింది. పెళ్లిళ్లు, ఇతర ఫంక్షన్లకు ఇస్తున్న


నిరుపయోగంగా ఆడిటోరియం


18వ వార్డులోని కమ్యూనిటీ హాల్ దుస్థితి

ప్పటికీ, వంట సామాగ్రి, పార్కింగ్ సౌకర్యం లేకపోవడం వల్ల దీనిని వినియోగించుకోవడానికి ఎవరూ ముందుకు రావడం లేదు. దీంతో కోట్లాది రూపాయల ప్రజాధనం వృథా అవుతోంది.

పత్తి మార్కెట్

పాత ఆర్డీవో కార్యాలయం వెనుక 22 ఎకరాల స్థలంలో రూ.6 కోట్లతో నిర్మించిన కాటన్ మార్కెట్‌లో క్రయవిక్రయాలు జరగడం లేదు. కొండపోచమ్మసాగర్(గజ్వేల్ కెనాల్) కాలువ మార్కెట్ స్థలం మధ్యలో నుంచి వెళ్లడం వల్ల స్థలం రెండుగా విడిపోయింది. ప్రస్తుతం స్థలం అన్యాక్రాంతం అయ్యే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. దీనికి కనీసం కంచె నిర్మాణం చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

ఆధునిక బస్టాండ్, బస్‌బేలు..

రూ.6 కోట్ల వ్యయంతో పట్టణానికి కిలోమీటరున్నర దూరంలో నిర్మించిన ఆధునిక బస్టాండ్‌లోకి ఒక్క బస్సు కూడా వెళ్లడం లేదు. అలాగే రూ.2.51 కోట్లతో గజ్వేల్ పట్టణంలో నిర్మిస్తున్న బస్‌బే, రూ.3.81 కోట్లతో ప్రజ్ఞాపూర్‌లో నిర్మిస్తున్న బస్టాండ్‌ల నిర్మాణాలు నత్తనడకన సాగుతున్నాయి. రవాణా శాఖ మంత్రి జిల్లాకు చెందిన వారైనప్పటికీ, ఈ నిర్మాణాలు పూర్తికాకపోవడం గమనార్హం.

ప్రజలకు అందుబాటులోకి తేవాలి

నిలిచిపోయిన పనులకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే నిధులు కేటాయించి, వాటిని పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి. గత ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందని ప్రజలకు ఇబ్బందులు కలిగించడం సరికాదు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు గుణపాఠం చెప్పడం ఖాయం.

-పాల రమేశ్‌గౌడ్ , బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి

త్వరితగతిన పూర్తి చేయాలి

బస్టాండ్‌లు, రింగ్‌రోడ్డు, కమ్యూనిటీ హాళ్లకు నిధులు కేటాయించి పనులు త్వరితగతిన పూర్తి చేయాలి. బస్టాండ్‌లు లేకపోవడంతో ప్రయాణికులు రోడ్డుపై నిలబడి ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇక రింగ్‌రోడ్డు పూర్తికాకపోవడంతో పట్టణంలో ట్రాఫిక్ సమస్య పెరిగిపోతుంది. ఇప్పటికైనా స్పందించాలి.

- కమ్మరి శ్రీనివాస్, టెలికాం బోర్డు సభ్యుడు, గజ్వేల్

భూసార పరీక్షా కేంద్రం

రూ.81.20 లక్షల వ్యయంతో వ్యవసాయ మార్కెట్ యార్డులో నిర్మించిన భూసార పరీక్షా కేంద్రం రైతులకు అందుబాటులోకి రాలేదు. 2023 ఏప్రిల్ 21న ప్రారంభించినప్పటికీ, రెండున్నరేళ్లు గడిచినా సిబ్బందిని, పరికరాలను కేటాయించలేదు. దీంతో రైతులకు భూసార పరీక్షలు నిర్వహించి సలహాలు ఇచ్చే అవకాశం లేకుండా పోయింది.

ఇతర నిర్మాణాలు..

రూ.కోటి వ్యయంతో 18వ వార్డులో చేపట్టిన కమ్యూనిటీ హాల్ నిర్మాణం మధ్యలో నిలిచిపోయింది. బాల, బాలికల ఎడ్యుకేషన్ హబ్‌ల లోని ఆడిటోరియంలు, పాత ఎంపీడీవో ఆఫీస్ భవనం శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. ముదిరాజ్ కమ్యూనిటీ హాల్, కోర్టు భవన నిర్మాణ పనులు కూడా నెమ్మదిగా సాగుతున్నాయి. రేడియల్ రోడ్ల అభివృద్ధి పనులు, జంక్షన్ల అభివృద్ధి పనులు కూడా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారయ్యాయి.

భారతదేశ ఉక్కు మహిళ ఇందిరా గాంధీ

● మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి నీలం మధు ముదిరాజ్


ఇందిరా గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నీలం మధు ముదిరాజ్

పటాన్ చెరు రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): తన పరిపాలనా దక్షతతో భారత దేశ ఉక్కు మహిళగా పేరుగాంచిన వీరవనిత మాజీ ప్రధాని భారతరత్న ఇందిరా గాంధీ అని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి నీలం మధు ముదిరాజ్ అన్నారు. బుధవారం ఇందిరా గాంధీ జయంతి పురస్కరించుకొని చిట్కుల్‌లోని ఆయన నివాసం వద్ద ఆమె చిత్రపటానికి పూలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ ఇందిరమ్మ పాలన సంక్షేమం, అభివృద్ధికి మారుపేరుగా నిలిచిందని తెలిపారు. ఆమె ముందుచూపుతో చేపట్టిన సంక్షేమ పథకాల ఫలితంగానే దేశం అభివృద్ధిలో దూసుకుపోతోందన్నారు. ఇందిరమ్మ పాలన స్ఫూర్తితోనే తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాలకు సంక్షేమాన్ని, అభివృద్ధిని అందిస్తుందని వివరించారు.

జాతీయ స్థాయి వర్క్‌షాప్‌నకు హుస్నాబాద్ ఉపాధ్యాయుడు

హుస్నాబాద్ రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి వర్క్‌షాప్‌నకు హుస్నాబాద్ పట్టణంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన ఆంగ్ల ఉపాధ్యాయుడు పంజా రాజమల్లయ్యకు ఆహ్వానం అందింది. కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ విభాగంలోని సెంటర్ ఫర్ కల్చరల్ రిసోర్సెస్ అండ్ ట్రైనింగ్ సౌజన్యంతో రాజస్థాన్‌లోని ఉదయపూర్‌లో 'పాఠ్యప్రణాళిక బోధనలో సాంస్కృతిక అంశాలు' అనే అంశంపై ఈ వర్క్‌షాప్ జరుగనున్నది. రాజమల్లయ్య 2025-26, 2026-27కు గాను డిస్ట్రిక్ట్ రిసోర్స్ పర్సన్‌గా ఎంపికయ్యారు. ప్రాథమిక స్థాయిలో సాంస్కృతిక విద్యను బలోపేతం చేయడం కోసం, సీసీఆర్‌టీ నేషనల్ కల్చరల్ అంబాసిడర్‌గా వ్యవహరించడానికి ఈ కార్యశాల నిర్వహిస్తున్నట్లు రాజమల్లయ్య తెలిపారు. ఇందులో దేశవ్యాప్తంగా 150 మంది ఉపాధ్యాయులు పాల్గొంటారని తెలిపారు. తెలంగాణ నుంచి రాజమల్లయ్యతో పాటు ములుగు జిల్లాకు చెందిన తాళిశెట్టి సుమతిదేవి హాజరుకానున్నారని వివరించారు. రాజమల్లయ్యను ఎస్‌సీఈఆర్‌టీ (తెలంగాణ) డైరెక్టర్ గాజర్ల రమేష్, డీఈవో ఎల్లంకి శ్రీనివాస్‌రెడ్డి, హుస్నాబాద్ ఎంఈవో బండారి మనీల, హెచ్ఎం వాసుదేవరెడ్డి తదితరులు అభినందించారు.

'అందెశ్రీ సాహిత్య అకాడమీ ఏర్పాటు చేయాలి'


అందెశ్రీ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న సాహితి సంస్థ సభ్యుల

సంగారెడ్డి రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కవి అందెశ్రీ పేరుమీద రాష్ట్ర ప్రభుత్వం జానపద సాహిత్య అకాడమీని ఏర్పాటు చేయాలని ప్రముఖ చరిత్ర పరిశోధకుడు డా. సంగిశెట్టి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సంగారెడ్డిలో బుధవారం తెలంగాణ స్టూడెంట్స్ వాయిస్ ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత అందెశ్రీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. రాష్ట్ర గీతాన్ని అందించిన అందెశ్రీ, తెలంగాణ జాతి గర్వించేలా ఉద్యమంలో ప్రజల్ని జాగృతం చేశారని గుర్తుచేశారు. హైదరాబాద్‌లోని డా. బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహం దగ్గర అందెశ్రీ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో మెతుకుసీమ సాహితి సంస్థ అధ్యక్షుడు పూసల లింగా గౌడ్, ఫ్రెండ్స్ విజ్ఞాన కేంద్రం ఫౌండర్ మోహన్, విశ్రాంత ఎంఈవో అంజయ్య, తెలంగాణ స్టూడెంట్స్ వాయిస్ అధ్యక్షుడు చింతల సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో నలుగురు నిందితుల అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ నరేందర్‌గౌడ్

నర్సాపూర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): భార్యతో అక్రమ సంబంధం ఉన్నదనే కారణంతో ఉత్తరప్రదేశ్‌కు చెందిన అన్సారీని హత్య చేసిన కేసులో నలుగురు నిందితులను 24 గంటల్లో పట్టుకుని అరెస్టు చేసినట్లు తూప్రాన్ డీఎస్పీ నరేందర్‌గౌడ్ పేర్కొన్నారు. బుధవారం నర్సాపూర్ సీఐ కార్యాలయంలో సీఐ జానారెడ్డి, ఎస్ఐ రంజితకుమార్‌లతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. జహీరాబాద్‌కు చెందిన మహ్మద్ షబ్బీరుకు నర్సాపూర్‌కు చెందిన మహిళతో వివాహమైంది. షబ్బీర్ దొంగతనాల కేసులో జైలులో ఉన్నప్పుడు అతడి భార్య తన స్నేహితురాలి భర్త అన్సారీతో అక్రమ సంబంధం పెట్టుకుంది. జైలు నుంచి బయటికొచ్చిన మహ్మద్ షబ్బీర్‌కు ఈ విషయం తెలియడంతో తన తల్లిదండ్రులు రేష్మా, షబ్బీర్లతో పాటు స్నేహితుడు శివారెడ్డి, మైనర్ బాలుడైన తన భార్య తమ్ముడిని తీసుకుని ఈ నెల 17న నర్సాపూర్‌కు వచ్చాడు. తన భార్యను బెదిరించి ఫోన్‌లో అన్సారీని నర్సాపూర్ రాయరావు చెరువు వద్దకు రప్పించాడు. అక్కడ తనవెంట వచ్చిన వారి సహకారంతో అన్సారీ కాళ్లు చేతులు పట్టుకుని, మహ్మద్ షబ్బీర్ వెంట తెచ్చుకున్న కత్తితో విచక్షణా రహితంగా దాడి చేసి హత్య చేసి పొదల్లో పడేసి పారిపోయారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు సీఐ జానారెడ్డి నేతృత్వంలో పోలీసులు రంగంలోకి దిగి, బీదర్ పారిపోతున్న నిందితులను గురువారం పట్టుకుని అరెస్టు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. కేసును త్వరగా ఛేదించిన సీఐ, ఎస్ఐతో పాటు సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

క్రీడల్లో గీతం విద్యార్థుల ప్రతిభ



విజేతలతో గీతం అధికారులు

పటాన్‌చెరు రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం హైదరాబాద్ విద్యార్థులు వివిధ క్రీడా పోటీలలో అత్యుత్తమ ప్రతిభను ప్రదర్శించి సంస్థకు కీర్తిని తెచ్చిపెడుతున్నారు. మందలపు శ్రీకాంత చెన్నైలోని జేఎన్ఎల్ఎస్‌లో జరిగిన 'ది చీఫ్ మినిస్టర్స్ ట్రోఫీ గేమ్స్' రాష్ట్ర స్థాయి పోటీలలో స్ట్రీట్ ఫైటర్ 6 లో రజత పతకాన్ని సాధించారు. రుషికేశ్ మార్కా హైదరాబాద్ హైటెక్ సిటీలో నిర్వహించిన వీవైబీ యాక్టివ్ సీనియర్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో పురుషుల సింగిల్స్‌లో బంగారు పతకాన్ని గెలుచుకున్నారు. అదే టోర్నమెంట్‌లో మరో విద్యార్థి ఆయుష్‌తో కలిసి పురుషుల డబుల్స్‌లో రజత పతకాన్ని కూడా సాధించారు. ఆశ్రిత రాజు దాట్ల ఇటీవల జరిగిన భారతీయ పికిల్ బాల్ జాతీయ పోటీలలో టీనేజ్ బాలికల రాష్ట్ర జట్టు ఈవెంట్‌లో బంగారు పతకాన్ని గెలుచుకున్నారు. విజేతలను గీతం హైదరాబాద్ అదనపు ఉప కులపతి ప్రొఫెసర్ డి.ఎస్.రావు, స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరెక్టర్ ప్రొఫెసర్ వి.ఆర్. శాస్త్రి, క్యాంపస్ లైఫ్ డైరెక్టర్ అంబికా ఫిలిప్, క్రీడల విభాగం డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఎం. నారాయణరావు చౌదరి అభినందించారు.

కార్తీక శోభ



కొమురవెల్లి, నవంబర్ 19 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయం మహామండపంలో పవిత్ర కార్తీకమాస బహుళ చతుర్దశిని బుధవారం ఘనంగా నిర్వహించారు. సాయంత్రం శ్రీరుద్రసూక్తం, హరిహర స్తోత్రముల పారాయణం నిర్వహించారు. ముగ్గులతో పూర్ణకుంభం ఆకృతిని రచించి దీపోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. దీపాకాంతులతో ఆలయం మండలం వెలిగిపోయింది.

క్రీడాకారులను ప్రోత్సహించాలి

● మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావు


క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రోహిత్‌రావు

మెదక్ అర్బన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పాఠశాల స్థాయి నుంచే క్రీడాకారులను గుర్తించి ప్రోత్సహించాలని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ బాలుర మైదానంలో అండర్-17 బాలురకు నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను ఎమ్మెల్యే టాస్ వేసి ప్రారంభించారు. ముగింపు కార్యక్రమానికి మెదక్ ఎంపీ రఘునందన్ రావు హాజరై క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. ఇన్‌చార్జి డీఈవో విజయ, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి నాగరాజు, టోర్నమెంట్ కన్వీనర్ మాధవరెడ్డి పాల్గొన్నారు.

30 వేల మందితో వందేమాతరం గీతాలాపన

● ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి


అధికారులతో సమీక్ష నిర్వహించిన ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్ చెరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): డిసెంబరు 1న 30 వేల మంది విద్యార్థులతో వందేమాతరం గీతాలాపనకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం పటాన్ చెరు క్యాంపు కార్యాలయంలో విద్యాశాఖ, పోలీసు అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. వందేమాతరం గీతం 150 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవోలు నాగేశ్వరరావు నాయక్, పీపీ రాథోడ్, ఎంపీడీవో యాదగిరి, డీఎస్పీ ప్రభాకర్, సీఐ వినాయకరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంతారం జాతరలో అపశ్రుతి... గుండంలో నీట మునిగి వ్యక్తి మృతి


తుకారాం మృతదేహం

మునిపల్లి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండల పరిధిలోని అంతారం జీవన్ముక్త పాండురంగ విఠలేశ్వర స్వామి వారి ఆలయ జాతర ఉత్సవాల్లో అపశ్రుతి చోటుచేసుకుంది. జహీరాబాద్ మండలం ఖాసింపూర్ గ్రామానికి చెందిన ధనసిరి తుకారాం(43) జాతర సందర్భంగా బంధువుల ఇంటికి వచ్చాడు. బుధవారం ఉదయం జీవన్ముక్త పాండురంగ విఠలేశ్వర స్వామి వారి ఆలయం వద్ద ఉన్న గుండంలో స్నానం చేసేందుకు దిగి, ఈత సరిగ్గా రాక ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెందాడు. మృతుడి భార్య చిలకమ్మ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజేష్ నాయక్ తెలిపారు.

ట్రాక్టర్, ఆటో ఢీ.. విద్యార్థి..


దేవరాజ్ (ఫైల్)

పాపన్నపేట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ ఆటో ఢీ కొన్న ఘటనలో ఒకరు మృతి చెందిన సంఘటన మండల పరిధి నాగసాన్ పల్లి గ్రామ శివారులో చోటు చేసుకుంది. ఎస్సై శ్రీనివాస్ గౌడ్ కథనం మేరకు.. పోడ్చన్‌పల్లి గ్రామానికి చెందిన విద్యార్థి పచ్చ దేవరాజ్ (17) అపుడప్పుడు క్యాటరింగ్ బాయ్ వెళ్తుంటాడు. మంగళవారం ఉదయం గ్రామానికి చెందిన కొందరితో కలిసి ఆటోలో ఏడుపాయలకు క్యాటరింగ్‌కు వెళ్లాడు. పని ముగించుకొని తిరిగి ఆటోలో ఇంటికివస్తుండగా నాగసాన్ పల్లి గ్రామ శివారులో ఎదురుగా వచ్చిన ట్రాక్టర్ ఆటోను ఢీకొట్టింది. దీంతో ఆటో బోల్తా పడి దేవరాజ్‌తో పాటు మరికొందరికి గాయాలయ్యాయి. దేవరాజ్ పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని..

పటాన్‌చెరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ సుభాష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సదాశివపేట మండలం నాగసానిపల్లి గ్రామానికి చెందిన నర్సింహులు(38) ప్రైవేటు పరిశ్రమలో సెక్యూరిటీ అధికారిగా పని చేస్తున్నారు. మంగళవారం రాత్రి పటానచెరు నుంచి మోటారు సైకిల్‌పై వెళుతుండగా, రుద్రారం గీతం యూనివర్శిటీ సమీపం యూటర్న్ వద్ద పటాన్‌చెరు నుంచి సంగారెడ్డి వెళుతున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. తీవ్ర గాయాలైన నర్సింహులు సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. భార్య అనురాధ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

బైక్ అదుపుతప్పి యువకుడు..

● ఐదు నెలల క్రితమే ప్రేమ వివాహం


వెంకటేశ్ మృతదేహం

తూప్రాన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటన తూప్రాన్ పట్టణ పరిధి కరీంగూడ వద్ద చోటు చేసుకుంది. తూప్రాన్-2 ఎస్ఐ యాదగిరి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నిజామాబాద్ మండలం ముప్కల్ గ్రామానికి చెందిన పన్నీరు వెంకటేశ్ (24)కు ఐదు నెలల క్రితం ప్రేమ వివాహం జరుగగా హైదరాబాద్‌లో నివాసముంటూ ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. ఈ నెల 15న ఆర్మూర్‌లోని సోదరి వద్దకు వచ్చిన అతడు.. 16న అర్ధరాత్రి 1.30 గంటల సమయంలో ద్విచక్ర వాహనంపై తిరిగి వెళ్తున్నాడు. తూప్రాన్ పట్టణ పరిధి కరీంగూడ వద్దకు రాగానే బైక్ అదుపు తప్పి రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్‌ను ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన వెంకటేశ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ యాదగిరి వివరించారు.

ఉరి వేసుకుని వివాహిత ఆత్మహత్య

● ఆరు నెలల క్రితం ప్రేమించి పెళ్లి
● వరకట్న వేధింపులే కారణమన్న తండ్రి

జగదేవ్‌పూర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రేమ వివాహం చేసుకున్న యువతి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని అలిరాజపేటలో బుధవారం జరిగింది. పోలీసులు, కుటుంబసభ్యుల కథనం ప్రకారం.. చిన్న ఆరెపల్లికి చెందిన సదా అఫ్రీన్(21) ఇదే మండలంలోని అలిరాజపేట గ్రామానికి చెందిన ఫరీద్(22) అనే యువకుడు ప్రేమించుకున్నారు. ప్రేమ విషయం ఇరువురి పెద్దలకు చెప్పి, వారి సమక్షంలో ఆరు నెలల క్రితం పెళ్లి చేసుకున్నారు. వివాహం తర్వాత ఇద్దరూ అన్యోన్యంగానే ఉండగా, తర్వాత భార్యభర్తల మధ్య మనస్పర్ధలు వచ్చాయి. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో యువతి గదిలో ఉరి వేసుకుంది. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే 108 వాహనంలో ఆసుపత్రికి తరలిస్తుండగా, మార్గమధ్యంలోనే మృతి చెందింది. ఎస్ఐ కృష్ణారెడ్డి సంఘటనాస్థలానికి వచ్చి ఆత్మహత్యకు గల కారణాలను తెలుసుకున్నారు. రాత్రి సమయం కావడం వల్ల మృతదేహాన్ని మార్చురీలో భద్రపరిచారు.

మా బిడ్డను చంపారు...

తమ బిడ్డను భర్త, అత్తమామ కలిసి చంపారని మృతురాలి కుటుంబ సభ్యులు ఆరోపించారు. మూడు నెలల నుంచి వరకట్నం తేవాలని వేధింపులకు గురి చేస్తున్నారని మృతురాలి తండ్రి షాబుద్దీన్ ఆరోపించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ కృష్ణారెడ్డి తెలిపారు.

అదృశ్యమై.. చెరువులో శవమై..

దుబ్బాక, నవంబరు19(ఆంధ్రజ్యోతి): నాలుగు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిన ఒక వృద్ధురాలు చెరువులో శవమై తేలిన సంఘటన బుధవారం దుబ్బాకలో జరిగింది. దుబ్బాక పట్టణంకు చెందిన మహబూబీ(65) సోమవారం ఇంటినుంచి వెళ్లి తిరిగిరాలేదు. ఆమె కోసం కుటుంబ సభ్యులు గాలించినా ఫలితం దక్కలేదు. బుధవారం సాయంత్రం రామసముద్రం చెరువులో శవమై తేలింది. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉన్నది.

ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతు కేంద్రంలో అగ్నిప్రమాదం

జహీరాబాద్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): జహీరాబాద్ విద్యుత్ కార్యాలయంలోని ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతు కేంద్రంలో బుధవారం అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. రిపేర్ కేంద్రం పైనున్న విద్యుత్ తీగల నుంచి నిప్పు రవ్వలు పడడంతో ఆకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. దీంతో సిబ్బంది వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది త్వరితగతిన అక్కడికి చేరుకుని మంటలను ఆర్పివేయడంతో భారీ ప్రమాదం తప్పింది.



సంక్షిప్తం

గ్రంథాలయంలో రంగవల్లి పోటీలు

సంగారెడ్డి రూరల్ నవంబరు 19 (ఆంధ్ర జ్యోతి): గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా బుధవారం సంగారెడ్డిలోని జిల్లా గ్రంథాలయంలో విద్యార్థులకు రంగవల్లి, మెహిందీలో పోటీలు నిర్వహించారు. సంగారెడ్డిలోని జిల్లా గ్రంథాలయంలో ఇందిరా గాంధీ చిత్ర పటానికి సంస్థ చైర్మన్ అంజయ్య పూల మాలలు వేసి నివాళ్లు అర్పించారు.

ప్లాస్టిక్ నుంచి భూమిని కాపాడుదాం

పాపన్నపేట, నవంబరు 19 (ఆంధ్ర జ్యోతి): ప్లాస్టిక్ భూతం నుంచి భూమిని కాపాడుదా మంటూ..పాపన్నపేట ఉన్నత పాఠశాల విద్యార్థులు బుధవారం అంగట్లో ప్రచారం నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా విద్యార్థులు అంగట్లోకి వెళ్లి ప్లాస్టిక్‌ను నిషేధిస్తూ, నీటిని సంరక్షిస్తూ.. కాలుష్యాన్ని నివారిస్తూ పర్యావరణాన్ని కాపాడాలని పిలుపు నిచ్చారు. పర్యావరణం కాపాడుతేనే మానవళి మనుగడ అంటూ తెల్పి చెప్పారు. కార్యక్రమంలో హెచ్ఎం మహేశ్వర్, టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

వివాహానికి ఆర్థిక సహాయం

చేగుంట నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): చేగుంట మండలం మక్కరాజుపేట గ్రామ ఉప సర్పంచ్ బాలిశెట్టి భాగ్య కూతురు వివాహానికి మాజీ సర్పంచ్ కుమ్మరి శ్రీనివాస్ బుధవారం రూ.50 వేల ఆర్థిక సాయం అందజేశారు. గత పాలకవర్గంలో ఉపసర్పంచ్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన బాలిశెట్టి భాగ్య భర్త శంకర్‌గౌడ్ అనారోగ్యంతో మృతి చెందాడు. కూతురు వివాహానికి తనవంతుగా ఆర్థిక సాయం అందించినట్లు ఆయన పేర్కొన్నారు.

వృత్తి విద్య కోర్సుల ద్వారా జీవనోపాధి

చేగుంట ,నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): వృత్తివిద్య కోర్సుల ద్వారా స్వయం ఉపాధి పొందవచ్చని చేగుంట ఆదర్శ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రకళ పేర్కొన్నారు. చేగుంట కళాశాలలో వృత్తి విద్యలో భాగంగా ఇంటర్న్‌షిప్ పూర్తి చేసిన విద్యార్థులకు బుధవారం ప్రిన్సిపాల్ సర్టిఫికెట్లు అందజేశారు.

ఆయిల్ పామ్ సాగుతో లాభాలు

పాపన్నపేట, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ఆయిల్ పామ్ సాగు ద్వారా అధిక లాభాలు వస్తాయని హార్టికల్చర్ జిల్లా మేనేజర్ వీవీ కిషన్ తెలిపారు. సహకార వారోత్సవాలను పురస్కరించుకొని బుధవారం కొత్తపల్లి రైతు సేవా సహకార సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రైతులు వాణిజ్య వంటల వైపు దృష్టి పెట్టాలని కోరారు. ఇందుకు ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుందని చెప్పారు.

విద్యార్థి దశ నుంచే ఆధ్యాత్మిక భావన అలవర్చుకోవాలి

పాపన్నపేట, నవంబరు 19 (ఆంధ్ర జ్యోతి): ప్రతీ విద్యార్థి చిన్నప్పటి నుంచే ఆధ్యాత్మిక భావన అలవర్చుకోవాలని డాక్టర్ గిరిధర్ తెలిపారు. బుధవారం మల్లంపేటలో జరుగుతున్న ఎన్ఎస్ఎస్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతు దైవ చింతన సన్మార్గాన్ని చూపుతుందన్నారు. వన భోజనాల వల్ల సమైక్యత పెరుగుతుందని చెప్పారు.

శ్రీశైలానికి శివ స్వాముల యాత్ర

వట్ పల్లి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని దేవనూర్ గ్రామంలో 23మంది శివ స్వాములు శ్రీశైలానికి కాలినడకన పాదయాత్రగా బయలుదేరారు. తొలుత దేవనూరులో హనుమాన్ మందిర్ వద్ద పూజలు, శివలింగానికి అభిషేకం నిర్వహించి అన్నదానం కార్యక్రమం చేశారు. అనంతరం ఇరుముడితో శ్రీశైలానికి బయలుదేరారు.

ఇసుక టిప్పర్ పట్టివేత

నిజాంపేట, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): నిజాంపేట మండల పరిధి నస్కల్ శివారులో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న టిప్పర్‌ను పోలీసులు పట్టుకున్నారు. ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా సరఫరా చేస్తుండగా.. బుధవారం లారీని సీజ్ చేశారు. కేసు నమోదు చేసి దార్యాప్తు చేస్తున్నట్లు నిజాంపేట ఎస్ఐ రాజేష్ తెలిపారు..

రాకపోకలకు ఇబ్బంది కలిగిస్తే చర్యలు

హత్నూర, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): దౌల్తాబాద్ చౌరస్తా నుంచి కాసాల చౌరస్తా వరకు రోడ్డును ఆక్రమించి రాకపోకలకు ఇబ్బందులు కలిగించే దుకాణదారులపై చర్యలు తప్పవని హత్నూర పోలీసులు స్పష్టం చేశారు. వాహనదారుల ఫిర్యాదు మేరకు హత్నూర పోలీసులు దుకాణదారులకు పలు సూచనలు చేశారు. దుకాణాలకు సంబంధించిన సామగ్రి రోడ్డుపై ఉంచకూడదని సూచించారు.

దాయర రహదారి విస్తరణకు మోక్షమెన్నడో?

- గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో రూ. 7.80 కోట్లతో పనులకు భూమిపూజ
- విస్తరణకు సహకరిస్తూ సొంత భవనాలను స్వచ్ఛందంగా కూల్చేసుకున్న యజమానులు
- పనులు ప్రారంభించి వదిలేసిన ఆర్ అండ్ బీ అధికారులు
- ప్రస్తుత ఎమ్మెల్యే రోహిత్‌రావు చొరవతో తిరిగి ప్రారంభమైన యూజీడీ పనులు
- మరికొన్ని భవనాల కూల్చివేస్తే గానీ పనులు ముందుకు సాగవని చేతులెత్తేసిన కాంట్రాక్టర్
- 18 నెలలుగా ఆగిన పనులు




అసంపూర్తిగా ఉన్న దాయర విస్తరణ రోడ్డు పనులు, సగానికి పైగా కూల్చేసిన ఓ భవనం

మెదక్ మున్సిపాలిటీ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఎన్నో రోజులుగా ఎదురుచూస్తున్న రహదారి విస్తరణ పనులను వారు తీపి కబురుగా భావించారు. నిధులు మంజూరు చేసి, భూమి పూజలు చేస్తే సంతోషపడ్డారు. కొంత మంది సంతోషపడితే మరికొందరు తమ నివాస, వాణిజ్య భవనాలు పోతున్నా సరే రోడ్డు విస్తరణకు సహకరిస్తామని స్వచ్ఛందంగా కూల్చివేసుకున్నారు. అయితే ఇరు శాఖల అధికారుల మధ్య సమన్వయం కొరవడటంతో ఆ రహదారి విస్తరణ పనులు కాస్తా ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. సుమారు 18 నెలలు గడుస్తున్నా పనులు మాత్రం ముందుకు సాగడం లేదు. ఇది ఎక్కడో కాదు.. మెదక్ జిల్లా కేంద్రంలోని దాయర రహదారి విస్తరణ పనుల దుస్థితి.

నిధులు మంజూరైనా..

మెదక్ పట్టణంలో అభివృద్ధి పనులు పడకేశాయి. రాందాస్ చౌరస్తా టు చమన్ టు దాయర వరకు రోడ్డు విస్తరణకు గాను గత ప్రభుత్వ హయాంలో రూ.7.80 కోట్లు మంజూరవగా ఆర్‌అండ్‌బీ అధికారులు కొంతవరకు పనులు ప్రారంభించి నిలిపివేశారు. తదనంతరం అధికారంలోకి వచ్చిన స్థానిక ఎమ్మెల్యే రోహిత్‌రావు చొరవ తీసుకొని కాంట్రాక్టర్‌ను పిలిచి పనులు ముమ్మరం చేయాల్సిందిగా ఆదేశించారు. దీంతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు ప్రారంభించి వదిలేశాడు. మరో పది భవనాలు కూల్చివేస్తే తప్ప రోడ్డు విస్తరణ పనులు చేపట్టబోమని స్పష్టం చేయడంతో చేసేదేమీ లేక.. ఎవరూ పట్టించుకోకపోవడంతో పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి.

పట్టించుకోని మున్సిపల్ అధికారులు

రోడ్డు విస్తరణ నిర్మాణానికి అవసరమైన భవనాలను కూల్చివేస్తే తప్ప పనులు చేసేది లేదని కాంట్రాక్టర్ చెబుతున్నాడు. మున్సిపల్ అధికారులు మాత్రం కూల్చివేతల విషయంలో అవసరమైన చర్యలు తీసుకోకపోవడంతో పనులు ముందుకు సాగడం లేదు. దీంతో ఇప్పటికే కూల్చివేసుకున్న నివాస, నివాసేతర భవన యజమానులు రోడ్డు నిర్మాణం ఎందుకు చేపట్టడం లేదని మండిపడుతున్నారు. విస్తరణ చేపట్టనప్పుడు తమపై ఒత్తిడి ఎందుకు తెచ్చారని.. తాము అద్దెలు కోల్పోయామని, ఇప్పుడెవరు కట్టిస్తారంటూ అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా విస్తరణకు అడ్డుగా ఉన్న మరికొన్ని భవనాలపై మున్సిపల్ అధికారులు కూల్చివేసే విధంగా చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



కూల్చివేయాల్సిన మరికొన్ని భవనాలు




ఇలాగైతే.. భద్రతపై భరోసా ఎలా?

ప్రజలు రక్షణ కోసం అర్ధరాత్రి అపరాత్రి అనే తేడా లేకుండా పోలీస్ స్టేషన్లను ఆశ్రయించడం మామూలే. అలాంటి అతి ముఖ్యమైన పోలీస్ స్టేషన్ పరిసరాల్లో వీధి దీపాలు వెలగక ప్రజల ఇబ్బందులు అంతా ఇంతా కాదు. ఇది ఎక్కడో కాదు మండలకేంద్రమైన చేగుంటలో పరిస్థితి. కొన్ని వారాలుగా వీధిలైట్లు వెలగక చేగుంట పోలీస్‌స్టేషన్ ఆవరణ పూర్తిగా చీకటిగా మారింది. దీంతో ఆ పరిసరాల్లో సీసీ కెమెరాలు ఉన్నప్పటికీ ఎవరైనా అనుమానాస్పద వ్యక్తుల కదలికలను కూడా పోలీసులు పర్యవేక్షించలేని దుస్థితి ఏర్పడింది. అంధకారంగా మారడంతో పోలీసు స్టేషన్ ముందునుంచి కూడా స్థానికులు నిర్భయంగా వెళ్లలేని పరిస్థితి నెలకొన్నది. వెంటనే వీధిలైట్లు వెలిగేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

- చేగుంట, నవంబర్ 19 (ఆంధ్రజ్యోతి)

బీఆర్ఎస్ నేతపై అట్రాసిటీ కేసు

- తప్పుడు కేసు పెట్టారంటూ డీజీపీని కలిసిన ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యే



డీజీపీని కలిసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు

మెదక్/మెదక్ మున్సిపాలిటీ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మెదక్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేత, మాజీ కౌన్సిలర్ మామిండ్ల ఆంజనేయులుపై పట్టణ పోలీసులు అట్రాసిటీ కేసు నమోదు చేశారు. మండలంలోని మాచవరం గ్రామానికి చెందిన నీరుడి రామక్రిష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆయనపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు సీఐ మహేష్ వివరించారు. ప్రస్తుతం ఆంజనేయులు పరారీలో ఉన్నట్లు పోలీసులు చెబుతున్నారు. అయితే, మెదక్ మాజీ కౌన్సిలర్, బీఆర్ఎస్ నేతపై అక్రమంగా కేసు నమోదు చేశారని పార్టీ మెదక్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ డీజీపీ శివధర్‌రెడ్డిని కలిసి ఫిర్యాదు చేశారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించే ప్రతిపక్ష నాయకులపై కేసులు పెడుతున్నారని ఆరోపించారు. రెండేళ్లలో మెదక్ నియోజకవర్గంలో పలువురిపై అక్రమ కేసులు బనాయించారని డీజీపీ దృష్టికి తీసుకెళ్లారు. స్థానిక పోలీసులు అధికారపార్టీ నాయకులు చెప్పిన మాటలు విని కేసులు నమోదు చేయడం ఎంత వరకు సమంజసమన్నారు. ఈ నెల 13న సంఘటన జరిగితే, 16వ తేదీన ఫిర్యాదు చేయడం ఏమిటన్నారు. పోలీసులు బీఆర్ఎస్ నేత ఇంటికి వెళ్లి అరెస్టు చేస్తామని కుటుంబీకులను బెదిరించడం దారుణమన్నారు. తప్పుడు కేసు పెట్టిన పోలీసులపై చర్యలు తీసుకుని, బీఆర్ఎస్ నాయకుడు మామిళ్ల ఆంజనేయులపై పెట్టిన అట్రాసిటీ కేసు ఎత్తివేయాలని కోరారు. డీజీపీని కలిసిన వారిలో మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి, నాయకులు కంఠారెడ్డి, తిరుపతిరెడ్డి, మల్లికార్జున్‌గౌడ్, అకిరెడ్డి కృష్ణారెడ్డి, ఆర్‌కే శ్రీనివాస్, వంజరి జయరాజ్, భీమరి కిషోర్ తదితరులు ఉన్నారు.


స్విమ్మింగ్‌లో రాణించిన రహ్మాన్

సంగారెడ్డి రూరల్ నవంబరు 19 (ఆంధ్ర జ్యోతి): పెద్దపల్లి జిల్లాలోని రాణి రుద్రమదేవి స్టేడియంలో గల స్విమ్మింగ్ పూల్‌లో 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్రస్థాయి ఈత పోటీలో సంగారెడ్డికి చెందిన ఎండీ అబ్దుల్ రహ్మాన్ రజత పతకాలు సాధించాడు. ఈ సందర్భంగా జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరి శ్రీనివాస్ రావు, ఎండి. అబ్దుల్ రహ్మాన్‌ను బుధవారం ఘనంగా సన్మానించారు. స్విమ్మింగ్ ఇంచార్జి శేషు కుమార్ మాట్లాడుతూ రహ్మాన్ అండర్ 14లో బ్రెస్ట్ స్ట్రోక్ 100 మీటర్స్ ఇండివిడ్యువల్ మెడ్లి 200 మీటర్స్‌లో 2 రజత పతకాలను సాధించడం ఆనందంగా ఉందన్నారు.

రాష్ట్రస్థాయికి గురుకుల విద్యార్థులు

నర్సాపూర్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయిలో నిర్వహించిన ఖోఖో ఎంపిక పోటీల్లో నర్సాపూర్ గిరిజన గురుకుల విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ కిషోర్ పేర్కొన్నారు. బుధవారం రాష్ట్ర స్థాయికి ఎంపికైన వర్షిత్(8వ తరగతి)తో పాటు బాలికల విభాగంలో శైలజ, శ్రావణి, నికితలు ఎంపికయ్యారని చెప్పారు. వీరు ఈ నెల 28,29వ తేదీల్లో పటాన్‌చెరులో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.

ఇందిరాగాంధీకి ఘన నివాళి



మెదక్‌లోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఇందిరాగాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రోహిత్‌రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసిని రెడ్డి తదితరులు



శివ్వంపేట: గొట్టిముక్ల చౌరస్తాలో ఇందిరాగాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్

దివంగత మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతిని మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో కాంగ్రెస్ శ్రేణులు బుధవారం ఘనంగా నిర్వహించాయి. ఈ సందర్భంగా ఆయా మండలాల్లోని ప్రధాన కూడళ్ల, కాంగ్రెస్ పార్టీ కార్యాలయాల్లో ఇందిరాగాంధీ విగ్రహాలు, చిత్రపటాలకు కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. పేదల సంక్షేమం, దేశసమగ్రత కోసం పాటుపడిన ఉక్కు మహిళ ఇందిరాగాంధీ అని కొనియాడారు. ఉమ్మడి మెదక్ జిల్లాపై ఆమె చెరగని ముద్ర వేశారన్నారు.

- న్యూస్ నెట్‌వర్క్, నవంబర్ 19 (ఆంధ్రజ్యోతి)



నారాయణఖేడ్‌లో ఇందిరాగాంధీ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి, నాయకులు



పటాన్‌చెరు ఎంపీపీ కార్యాలయ ప్రాంగణంలో ఇందిరాగాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఐఎన్‌టీయూసీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు

ఉచిత వైద్య శిబిరాలు అభినందనీయం



రాములుగౌడ్‌కు ఆరోగ్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

రామచంద్రాపురం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఉచిత వైద్య శిబిరాలను తండాల్లో కూడా ఏర్పాటు చేయడం అభినందనీయమని తెల్లాపూర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ బి.రాములుగౌడ్ అన్నారు. బుధవారం మున్సిపల్ పరిధిలోని వెలిమెల తండాలో ఆల్ ఇండియా ట్రూ క్రిస్టియన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో, జయశాలి జన్మదినాన్ని పురస్కరించుకుని ఉచిత మెగా వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాములుగౌడ్ మాట్లాడుతూ ప్రార్థనా మందిరాలు కూడ సామాజిక బాధ్యత వహించడం శుభపరిణామమన్నారు. ఈ సందర్భంగా రోగులకు వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

విధుల పట్ల నిర్లక్ష్యం వహించరాదు

అల్లాదుర్గం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): విధుల పట్ల నిర్లక్ష్యం వహించకుండా పనులు చేపట్టాలని జెడ్పీ డిప్యూటీ సీఈవో గీత అధికారులకు సూచించారు. బుధవారం అల్లాదుర్గం మండల పరిషత్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేపట్టి సంబంధిత రికార్డులను పరిశీలించారు. అనంతరం ఎన్ఆర్ఈజీఎస్ అధికారులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శులు ప్రతి రోజూ నిర్వహించే పనులపై అవగాహన కల్పించారు. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ, ప్రభుత్వ పథకాల అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఎంపీడీవో వేద ప్రకాశ్ రెడ్డి, ఏపీవో సుధాకర్, ఎంపీవో లింగప్ప ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పొగమంచు

(5వ పేజీ తరువాయి)

చిన్నపాటి నిర్లక్ష్యం కూడా పెను ప్రమాదానికి దారితీసే అవకాశం ఉంది.

రోడ్లపై ధాన్యం కుప్పలతోనూ జాగ్రత్త!

అంతర్గత రహదారులపై పొగమంచుతో పాటు రైతులు ఆరబెడుతున్న వరి ధాన్యంతో పెద్దముప్పు పొంచిఉంది. చాలా చోట్ల రైతులు రోడ్లపైనే ధాన్యాన్ని ఆరబెట్టి, రాత్రి సమయంలో కుప్పలు పోసి ఉంచుతున్నారు. ఉదయం దట్టమైన పొగమంచు కమ్ముకున్న వేళ, రహదారులపై ఉన్న ఈ ధాన్యం కుప్పలు డ్రైవర్లకు అస్సలు కనిపించడం లేదు. వీటిని గమనించకుండా వేగంగా వస్తే ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. ఈ విషయంపై పోలీసులు పలుమార్లు హెచ్చరికలు జారీ చేసి, రోడ్లపై ధాన్యం ఆరబెడితే కేసులు నమోదు చేస్తామని చెబుతున్నా రైతులు పట్టించుకోవడం లేదు. వరి కుప్పల విషయంలో వాహనదారులు తస్మాత్ జాగ్రత్త వహించాలని పోలీస్ అధికారులు ప్రత్యేకంగా సూచిస్తున్నారు.

పోలీసు అధికారుల సూచనలు

- వంద మీటర్ల కంటే తక్కువ దూరంలో ఉన్న వాహనాన్ని చూడలేని సమయంలో వాహనం ఫాగ్ ల్యాంప్‌ను ఆన్ చేయాలి. తక్కువ బీమ్‌లో హెడ్‌లైట్లను సెట్ చేసుకోవాలి.
- హైబీం హెడ్‌లైట్లను ఉపయోగించడం వల్ల పొగమంచు కాంతికి రిఫ్లెక్ట్ అయి ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉంది. వాహన వేగాన్ని తగ్గించాలి.
- పొగ మంచులో ప్రయాణం చేసే సమయంలో వాహనాల్లో సౌండ్ సిస్టమ్‌ను ఆపివేయాలి.
- జాతీయ రహదారులపై లేన్‌లను మార్చవద్దు. వాహనాలను ఎడమవైపు నడుపుతూ, మలుపు తిప్పే సమయంలో అవసరమైన చోట ఇండికేటర్లను కచ్చితంగా ఉపయోగించాలి.
- కారు అద్దాలు క్లీన్‌గా ఉండేలా చూసుకోవాలి. బయట పొగమంచు వాహనం లోపలికి ఘనీభవనానికి కారణమై, డ్రైవర్ దృష్టికి మరింత ఆటంకం కలిగిస్తుంది. వాహనంలో హీటర్‌ను ఆన్ చేయాలి.
- పొగమంచు ఉన్నప్పుడు డ్రైవింగ్‌లో వాహనాలను ఓవర్ టేక్ చేయకూడదు.

పొగ మంచు వేళ జాగ్రత్తలు అవసరం



పొగమంచు తీవ్రత దృష్ట్యా ఉదయం 8 గంటల లోపు అత్యవసరం కాని ప్రయాణాలను వాయిదా వేసుకోవాలి. ఒకవేళ మంచుకురిసే సమయంలో ప్రయాణిస్తే తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాలి. ముఖ్యంగా జాతీయ రహదారులపై నుంచి వెళ్లేవారు తగిన జాగ్రత్తలు పాటిస్తూ గమ్యస్థానం సురక్షితంగా చేరుకోవాలి.

- పరితోష్ పంకజ్, సంగారెడ్డి ఎస్పీ

స్థానిక సంస్థల ఎన్నికల్లో సమష్టిగా పనిచేయండి



మంత్రి దామోదరరాజనరసింహతో కాంగ్రెస్ పుల్‌కల్ మండల నాయకులు

పుల్‌కల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కలసికట్టుగా పనిచేయాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సీ.దామోదర రాజనరసింహ సూచించారు. చౌటకూర్ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు బుధవారం హైదరాబాద్‌లోని మంత్రి నివాసానికి తరలివెళ్లారు. ఈ సందర్భంగా మంత్రి తనను కలిసిన శ్రేణులనుద్దేశించి మాట్లాడారు. మంత్రిని కలిసినవారిలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నత్తి దశరత్, ఆలయ కమిటీ చైర్మన్ భానూరి లక్ష్మయ్య, నాయకులు కలాలి ఈశ్వర్‌గౌడ్, రాజశేఖర్, వెంకటరెడ్డి, బాలాగౌడ్, మల్లికార్జున్‌గౌడ్, మౌలాన, కైసర్ తదితరులున్నారు.

పోలీసుల సంక్షేమానికి కృషి: సంగారెడ్డి ఎస్పీ

సంగారెడ్డి క్రైం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసుల సంక్షేమానికి తాము ఎల్లవేళలా కృషి చేస్తున్నామని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం గ్యాస్ సిలిండర్ పంపిణీ ఆటోను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల రక్షణలో నిమగ్నమయ్యే సిబ్బంది సంక్షేమమే తమ బాధ్యత అని అన్నారు. సిబ్బంది సౌకర్యార్థం గ్యాస్ సిలిండర్లను ఆటో ద్వారా ఇంటింటికీ పంపిణీ చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్టు తెలిపారు. సిలిండర్ అవసరమున్న సిబ్బంది ఆన్‌లైన్ ద్వారా గానీ, గ్యాస్ బుకింగ్ నంబరు ద్వారా గానీ బుక్ చేసుకోవచ్చన్నారు. బుకింగ్ చేసిన రెండు రోజుల కాల వ్యవధిలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గ్రీన్ ఆటో ద్వారా సిలిండర్‌ను ఇంటివద్దకు తీసుకొస్తారన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రఘునందన్‌రావు, ఏఆర్ డీఎస్పీ నరేందర్, డీఎస్పీలు సత్తయ్యగౌడ్, ప్రభాకర్, సైదానాయక్, ఆర్ఐలు రామారావు, రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు టెట్ మినహాయింపు ఇవ్వాలి



చేగుంటలో ఎంపీకి వినతిపత్రం అందజేస్తున్న తపస్ మెదక్ జిల్లా నాయకులు

చేగుంట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): 2010 కంటే ముందు నియమితులైన ఉపాధ్యాయులకు టెట్ మినహాయింపు ఇవ్వాలని తపస్ మెదక్ జిల్లా శాఖ నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు వారు బుధవారం చేగుంట ఐబీ గెస్ట్ హౌస్‌లో మెదక్ ఎంపీ రఘునందన్ రావుకు వినతిపత్రం అందజేశారు. ఎంపీని కలిసినవారిలో తపస్ మెదక్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జిడ్డి ఎల్లం, చల్లా లక్ష్మణ్, తపస్ రాష్ట్ర కార్యదర్శి దుబాషి భాస్కర్, చేగుంట మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రావుల వెంకటేశం, కృష్ణమూర్తి, తపస్ జిల్లా బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

కొడిపల్లి: సనాతన ధర్మం ఆలయాలకు వెళ్లే ప్రతీ మనిషికి ఎంతో క్రమశిక్షణ నేర్పుతుందని మెదక్ ఎంపీ రఘునందన్ రావు పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని ధర్మసాగర్ గేట్ శివపంచాయత హనుమాన్ ఆలయాన్ని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ మల్లేశం గౌడ్‌తో కలసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. ఆలయాలు నిర్మించడమే గాకుండా ప్రతినిత్యం ధూప దీప నైవేద్యాలు నిర్వహించాలన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన

జహీరాబాద్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రైతులు పంటలకు సేంద్రియ ఎరువులను తప్పనిసరిగా ఉపయోగించాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శివప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని డిడ్గి శివారులో గల కృషి విజ్ఞాన కేంద్రంలో ఆయా గ్రామాల రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో నాబార్డ్ డీడీఎం కృష్ణ తేజ, ఏడీఏవో శ్రీదేవి, సీనియర్ శాస్త్రవేత్త వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం లేక రైతులకు ఇబ్బందులు

శివ్వంపేట, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): తమ గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించక పోవడంతో పండించిన ధాన్యాన్ని అమ్ముకోవాలంటే పక్క గ్రామానికి వెళ్తూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నా అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు నిరసన వ్యక్తం చేశారు. ఈ ఘటన గంగయ్య పల్లి గ్రామంలో బుధవారం చోటుచేసుకున్నది. గ్రామంలో ఖరీఫ్ సీజన్‌లో ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని నేటికీ ఏర్పాటు చేయకపోవడంతో ధాన్యం విక్రయించేందుకు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పలువురు రైతుల ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు.

రోడ్ల మరమ్మతులు చేపట్టాలి



పైడిగుమ్మల్ రోడ్డు బాగు చేయాలని రోడ్డుపై బైఠాయించి, ధర్నా నిర్వహిస్తున్న గ్రామస్థులు

కోహీర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కోహీర్ నుంచి మండలంలోని పైడిగుమ్మల్ గ్రామం వరకు పాడైన రోడ్డును బాగు చేయాలని పైడిగుమ్మల్ గ్రామస్థులు బుధవారం పైడిగుమ్మల్ ప్రధాన రహదారిపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ.. రోడ్డు పాడై దాదాపు పదేళ్లు గడుస్తున్నా ఇప్పటివరకు రోడ్డు బాగు చేయడం లేదన్నారు. ఈ రోడ్డు మరమ్మతుల కోసం ప్రభుత్వం కొన్ని నెలల క్రితమే రూ.1.20 కోట్ల నిధులను మంజూరు చేసినప్పటికీ సంబంధిత అధికారులు రోడ్డు పనుల కొరకు టెండర్ ఖరారు చేయలేదు. పనులు ప్రారంభించడం లేదు. ఇప్పటికైనా పాడైన పైడిగుమ్మల్ రోడ్డును బాగుచేయాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రత్నయ్య, దావీద్, ప్రభాకర్, నవీన్‌కుమార్, వినోద్, అశోక్, శ్రవణ్‌కుమార్, కవిరాజ్ తదితరులు ఉన్నారు.

శివంపేట జడ్పీహెచ్ఎస్‌లో హరియాణా వంటకాలు



విద్యార్థులు వండిన ఆహార పదార్థాలను రుచి చూస్తున్న ఉపాధ్యాయులు

పుల్‌కల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): చౌటకూర్ మండలం శివంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం 'ఏక్ భారత్- శ్రేష్ఠ్ భారత్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా పాఠశాల విద్యార్థినులు హరియాణా రాష్ట్ర ప్రజలు తినే ఆహారాన్ని స్వయంగా వండి పాఠశాల ఆవరణలో స్టాల్స్ ప్రదర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం వేదశ్రీ మాట్లాడుతూ దేశ సంస్కృతి, సంప్రదాయాలు, అన్నీ రాష్ట్రాల విద్యార్థులలో జాతీయతా భావాలను పెంచుతుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సునీతవేణి, మాణిక్యం, సునీత బాయి, శైలజ, వాణిశ్రీ, శ్రీదేవి, స్వప్న, ఇతర ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలి

చిలప్‌చెడ్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి, మిల్లులకు తరలించాలని నర్సాపూర్ ఆర్డీవో మహిపాల్ రెడ్డి సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని సిలాంపల్లి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్దేశిత తేమ వచ్చిన ధాన్యాన్ని వెంటనే రైస్ మిల్లులకు తరలించాలన్నారు. రైతులకు 48 గంటల్లోగా చెల్లింపులు జరిగేలా చూడాలని ఆదేశించారు.

కులాంతర వివాహాలకు రక్షణ చట్టం చేయాలి

సంగారెడ్డి రూరల్ నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కులాంతర వివాహాలకు రక్షణ చట్టం చేయాలని కుల వివక్ష పోరాట సంఘం (కేవీపీఎస్) జిల్లా కార్యదర్శి అశోక్ డిమాండ్ చేశారు. దళిత యువకుడు ఎర్ర రాజశేఖర్ హత్యను ఖండిస్తూ సంగారెడ్డిలో బుధవారం కేవీపీఎస్ నాయకులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు.